

మద్దిలేటి స్వామికి పూజలు

బేతంచెర్ల: ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరపూజ చేసి మొక్కులు చెల్లించారు.



మన'సారా' ఒక్కటై..

నల్లమల అడవిలోని చెంచులు ఆచారాలు, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. వివాహంలో యువతి, యువకుల ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1.633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:34,023
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:33,716

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడికి రూ. 48.61 లక్షల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న సేవకులు

మహానంది: మహానంది క్షేత్రానికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 48,61,653 ఆదాయం లభించినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలోని అభిషేక మండపంలో శనివారం ఉభయ ఆలయాల హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ఎండోమెంట్ ఆఫీసర్ మోహన్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ఆంజనేయస్వామి, కోదండ రామాలయాల్లోని హుండీల్లో 50 రోజులకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 48,04,588 ఆదాయం వచ్చిందన్నారు. అన్నప్రసాదం, గో సంరక్షణ విభాగాల ద్వారా రూ. 57,065.. మొత్తం రూ. 48.61 లక్షలు లభించిందన్నారు. నగదు కానుకలతో పాటు 9 గ్రాముల 90 మిల్లీ గ్రాముల బంగారు, 470 గ్రాముల వెండి భక్తులు సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిఖరేశ్వరం అభివృద్ధికి చర్యలు



శిఖరేశ్వరం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలోని శిఖరేశ్వరం వద్ద పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన శిఖరేశ్వరం ఆలయాన్ని పరిశీలించారు. కోనేరు, ఆలయం చుట్టూ క్షేత్ర విశిష్టతలను తెలిపే బొమ్మలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ శివ లింగానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. టికెట్ కౌంటర్ వద్ద విరాళ సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

33 మంది ఎస్‌ఐలకు త్వరలో పదోన్నతి

కర్నూలు: పోలీసు శాఖ ఫోర్త్ జోన్ (రాయలసీమ జోన్) పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 33 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పించేందుకు ప్యానెల్ జాబితా సిద్ధమైంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల్లోని శాంతి భద్రతల (లా అండ్ ఆర్డర్ స్టేషన్లు) విభాగంతో పాటు సీఐడీ, రైల్వే, ఎస్‌బీఐ, ఇంటెలిజెన్స్ తదితర లూప్‌లైన్ విభాగాల్లో పనిచేస్తున్న 33 మంది ఎస్‌ఐలు ప్రభుత్వ అనుమతితో సీఐలుగా పదోన్నతి పొందనున్నారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 మంది, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 6గురు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 9 మంది, వైఎస్సార్ కడప జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలు పదోన్నతి జాబితాలో ఉన్నారు. లూప్‌లైన్ విభాగాల్లో పనిచేస్తున్న మరో 8 మంది ఎస్‌ఐలు కూడా పదోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ మేరకు జాబితా విడుదలైంది.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు(అర్బన్): అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజునాయుడు పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ నానా దుర్భాషలాడిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాల్మీకి నేతలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వాల్మీకి/బోయ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు కుబేరస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణమనాయుడు, ప్రధాన కార్యదర్శి బస్తిపాటి మల్లికార్జున, బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె. శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరాజునాయుడుపై జరిగిన సంఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ఉన్న జిల్లా అధికారి పట్ల జేసీ ప్రవర్తించిన తీరును చూస్తే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సుపరిపాలన అంటే ఇదేనా అని వారు ప్రశ్నించారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, పీఆర్అండ్ఆర్‌డీ మంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

దాతలను వెతకలేక.. ఖర్చుకు ఒప్పించలేక!

అధికారులకు తలనొప్పిగా పీ4

- ఇప్పటికే ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి
- మార్గదర్శులను(దాతలు) వెతికి స్పాన్సర్ చేయించాలని లక్ష్యాలు
- జిల్లా నుంచి మండలస్థాయి అధికారులందరికీ తప్పని తిప్పలు
- దాతలను వెతికే బాధ్యతపై తీవ్ర వ్యతిరేకత
- తప్పించాలని కలెక్టర్లకు మూకుమ్మడిగా చెప్పే ప్రయత్నం

'సామ్మొకడిది.. సోకొకడిది, ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' ఇలాంటి సామెతలన్నీ ఇప్పుడు ప్రభుత్వ అధికారుల నోటిలో నానుతున్నాయి. పేదరిక నిర్మూలన చేస్తామని ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించిన పీ4 ప్రాజెక్టు అమలు అధికారులు, ప్రైవేటు వ్యక్తులకు తలనొప్పిగా మారింది. 'మార్గదర్శులు'ను వెతికి, వారిని పీ4 కోసం ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 'మీరేం చేస్తారో తెలీదు, కచ్చితంగా మార్గదర్శులను(దాతలు) వెతికి, వారిని ఒప్పించాల్సిందేనని తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఫలితంగా అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రభుత్వ ఆర్భాటం కోసం తమను ఇబ్బంది పెట్టడం ఏంటనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ బాధ్యత నుంచి తమను తప్పించాలని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి ముక్తకంఠంతో తేల్చి చెప్పేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.


– సాక్షి ప్రతినిధి కర్నూలు



సూపర్‌సిక్స్‌లో అరకొరగా తల్లికి వందనం, పాక్షికంగా ఉచిత గ్యాస్ అమలు మినహా తక్కిన నాలుగు పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు 'పీ4(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) అనే ఓ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల భాగస్వామ్యంతో సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించి, వారి ఆర్థికస్థితి మెరుగుపరుస్తామనేది ప్రభుత్వ ఉద్దేశం. ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారు. తద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతోంది. రూ.3లక్షల కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఆ డబ్బుతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అయితే మార్గదర్శుల పేరుతో దాతలను వెతికి వారితో ఖర్చు పెట్టించి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతుండటం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అధికారుపై కలెక్టర్ల తీవ్ర ఒత్తిడి

రాష్ట్రవ్యాప్తంగా పీ4 కింద మార్గదర్శులుగా ప్రభుత్వం కొందరిని ఒప్పించింది. వీరికి ఈ నెల 18న ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విందు ఏర్పాటు చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులు పెట్టిన 'గ్రీన్‌కో' అధినేత చలమలశెట్టి అనిల్, జయరాజ్ ఇస్పాత్ నుంచి సజ్జన్‌కుమార్ గోయంకా, రామ్‌కో సిమెంట్ నుంచి వెంకటరమణరావు కూడా ఉన్నారు. ఇలా ఆర్థికంగా బలంగా ఉన్నవారితో పాటు ప్రతీ జిల్లా అధికారి నుంచి మండలస్థాయి అధికారి వరకూ అందరూ 'మార్గదర్శులు'ను వెతికాలని కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారి సమీక్షలు నిర్వహించి ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిణామం అధికారులను విస్మయానికి గురి చేస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతపై ఒత్తిడి చేస్తే పని చేస్తాం కానీ, దాతలను వెతకాలంటే ఎక్కడి నుంచి తీసుకురావాలని పెదవి విరుస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి ఉండటంతో అధికారులు ఎవరి స్థాయిలో వారు దాతలను వెతికే పనిలో ఉన్నారు.



పీ4 ప్రవేశపెట్టడం వెనుక ప్రభుత్వకుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విధానంతో పేదలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని, 2029కి వందశాతం పేదరిక నిర్మూలన చేస్తామని, అప్పటికీ పేదరికం ఉంటే, అప్పుడు ఆడబిడ్డనిధి పథకాన్ని పీ4కు అనుసంధానం చేస్తామని మే 17న కర్నూలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

... అంటే 2029 వరకు ఆడబిడ్డనిధి అమలు చేయలేమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పినట్లయింది.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 చొప్పున చెల్లించారు. ఇదే పథకాన్ని ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్లు నిండిన మహిళలు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18వేలు చెల్లిస్తామని కూటమి మేనిఫెస్టోలో పొందపరిచారు. ఇప్పుడు ఈ పథకాన్ని అమలు చేయకుండా పీ4ను తెరపైకి తీసుకురావడం గమనార్హం.

మహాశక్తి

ఆడబిడ్డ నిధికి మంగళం

2029 వరకూ ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదని కర్నూలు పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పకనే చెప్పారు. 2029 మొదటి త్రైమాసికం వరకే ప్రభుత్వానికి ప్రజలు గడువిచ్చారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు ఉంటాయి. పీ4 ముసుగులో ఆడబిడ్డ నిధిని ప్రభుత్వం అటకెక్కించింది. ఆడబిడ్డ నిధి కింద కర్నూలు జిల్లాలో 6,98,404 మంది, నంద్యాల జిల్లాలో 9,08,616 మంది అర్హులు ఉన్నారు. వీరికి గతేడాది రూ.2,892.62కోట్లు ప్రభుత్వం బకాయి పడింది. ఈ ఆర్థిక సంవత్సరం మరో రూ.2,892.62కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. పీ4కు పథకాన్ని అనుసంధానం చేశామని ప్రభుత్వం చెప్పడం, దాని అమలుకు అధికారులను ఒత్తిడికి గురి చేయడం చూస్తే పథకాన్ని పూర్తిగా పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

చేతులెత్తేసేందుకు సిద్ధమైన అధికారులు

అధికారుల సంప్రదింపులతో కొందరు దాతలు ఒప్పుకోకపోగా అధికారులపై చిర్రుబుర్రులాడుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖతో పాటు అన్ని కీలకశాఖల అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దాతలను వెతకలేక డీలా పడుతున్నారు. ఈ పరిణామం అధికారులను తీవ్ర వేదనకు గురి చేస్తోంది. కొన్ని చోట్ల దాతలు దొరక్కపోతే తామే ఆర్థికభారం మోయాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయని కొందరు అధికారులు 'సాక్షి'కి తెలిపారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక రెండు జిల్లాల్లోని అధికారులు ఏకమై 'మార్గదర్శుల'ను తాము వెతకలేమని, ఆ బాధ్యతను ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, కూటమి పార్టీలోని నాయకులకు అప్పగించాలని కలెక్టర్లకు చెప్పేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

విధిగా ఒక్కో కుటుంబం దత్తత

కూటమి ప్రభుత్వంలో అధికారుల పరిస్థితి దారుణంగా తయారైంది. విధి నిర్వహణలో టీడీపీ నాయకుల ఒత్తిళ్లు ఒక ఎత్తయితే.. ప్రభుత్వం పీ4లో భాగంగా ప్రతి అధికారి ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. విధి నిర్వహణను చూసుకోవాలో, లేక ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ఊరు మీద పడి తిరగాలో తెలియక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చంద్రబాబూ... కక్ష పూరిత రాజకీయాలు మానుకో

- లిక్కర్ కేసు అంతా బోగస్
- అక్రమ అరెస్టులతో పైశాచిక ఆనందం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



కర్నూలు (టౌన్): సీఎం చంద్రబాబు నాయుడు కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి హితవు పలికారు. అక్రమ కేసులు, అరెస్టులతో వేధింపులకే పాల్పడితే ప్రజలు తిరగబడతారన్నారు. శనివారం స్థానిక కల్లూరులోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతి రేక విధానాలపై 13 నెలలుగా వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రజా పోరాటాలతో చంద్రబాబు నాయుడు వెన్నులో వణుకు పుట్టిందన్నారు. రాష్ట్రాన్ని దోపిడీ చేసేందుకు ఎవరూ అడ్డు రాకూడదనే దుర్దేశంతో వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నారు. లిక్కర్ కేసు ఓ బోగస్ కేసు అని, కేవలం జగనన్న చుట్టూ ఉండే ముఖ్య నేతలను ఇబ్బందులు పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏడాదిగా అమాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎల్లో మీడియా చేస్తున్న డ్రామాలు అని ప్రజలకు తెలిసి పోయిందన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయడం చేతకాక ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. లిక్కర్ కేసులో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం చిన్న స్థాయి ఉద్యోగులను బెదిరించి భయపెట్టాలని చూస్తుందన్నారు. మొదట్లో రూ. 50 వేల కోట్ల స్కామ్ అంటూ, ఆ తర్వాత రూ. 2 వేలు అంటూ కట్టు కథలు అల్లుతున్నారన్నారు. అక్రమ అరెస్టులు చేయించి కూటమి నేతలు పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. చంద్రబాబు కుట్రలకు భయపడేది లేదని, వైఎస్సార్‌సీపీ నాయకులు దీటుగా ఎదుర్కొంటారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అభాసు పాలయ్యిందన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలకు చోటు



గుండం సూర్యప్రకాష్‌రెడ్డి



భూమా కిశోర్‌రెడ్డి



బుడ్డా శేషారెడ్డి



కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

నంద్యాల: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. జిల్లాకు చెందిన నలుగురిని పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా గుండం సూర్యప్రకాష్‌రెడ్డి (బనగానపల్లె), భూమా కిశోర్‌రెడ్డి (ఆళ్లగడ్డ), బుడ్డా శేషారెడ్డి (శ్రీశైలం), కర్రా హర్షవర్ధన్‌రెడ్డి (బనగానపల్లె)లను నియమించినట్లు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులకు సహాయకారిగా వీరు వ్యవహరించనున్నారు.

బంగారు వ్యాపారికి బురిడీ

కర్నూలు: నగరంలోని షరాఫ్ బజార్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యాపారికి బురిడీ కొట్టించారు. ఇద్దరు వ్యక్తులు షరాఫ్ బజార్‌లో హరి అనే వ్యాపారి దగ్గరికి వెళ్లి తమ దగ్గర ఉన్న బంగారం అమ్ముతామని ఒరిజినల్ చూపించారు. వ్యాపారి దానిని పరిశీలించి రూ.లక్ష విలువ చేస్తుందని డబ్బులు ఇచ్చాడు. ఆ తర్వాత నకిలీ బంగారాన్ని వ్యాపారి చేతిలో పెట్టి అక్కడి నుంచి ఉడాయించారు. కొద్దిసేపు తర్వాత బంగారాన్ని కరిగించేందుకు వ్యాపారి పరిశీలించగా నకిలీదని తేలడంతో మోసపోయినట్లు గ్రహించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నంద్యాలను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. డిస్పోజబుల్ గ్లాసులు వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, వీటిపై పోలీస్, మున్సిపల్ యంత్రాంగం దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు పూర్తిగా నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వాటికి ప్రత్యామ్నాయ జూట్ బ్యాగ్స్, పేపర్ బ్యాగ్స్ వినియోగాన్ని పెంచాలన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కొందరికి జూట్ బ్యాగ్‌లు అందజేశారు.



పట్టణ ప్రజలకు జూట్ బ్యాగ్‌లు అందజేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

రాష్ట్రంలో అరాచక పాలన

- అక్రమ కేసులతో భయపెట్టలేరు
- పోలీసుల ఏకపక్ష తీరు సరికాదు
- నాడు పరిశ్రమలను అడ్డుకున్న బీసీకి నేడు కాంట్రాక్ట్‌లు



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'పై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

కొలిమిగుండ్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయం ఆవరణలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'పై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయన్నారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని, పోలీస్ స్టేషన్‌కు ఎవరైనా ప్రజలు వెళితే ఏ పార్టీ అని అడగటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. టీడీపీ నాయకులు గనులు, ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు సహకరించామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రోత్సహించిందన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ యాజమానులు విరుద్ధంగా టీడీపీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. గతంలో పెట్నికోట అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రస్తుత మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఫ్యాక్టరీకి వ్యతిరేకం, పొల్యూషన్ వస్తుందని చెప్పారని, నేడు ఆయనకే కంపెనీలు కాంట్రాక్ట్‌లు అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన వారిని బాగా గుర్తు పెట్టుకోవాలని, ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. టీడీపీ నాయకులు సుపరిపాలన పేరుతో చీకటి పడ్డాక గ్రామాలకు తూతూ మంత్రంగా వెళ్లి వస్తున్నారని విమర్శించారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి పల్లెలో తాము జగనన్న సంక్షేమ పథకాల గురించి వివరించామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల అమలులో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు.

మంత్రికి చౌకబారు మాటలు తగవు

మంత్రి స్థానంలో ఉన్న బీసీ జనార్దనరెడ్డి స్థాయికి తగ్గట్లుగా మాట్లాడకుండా చౌకబారుగా మాట్లాడం తగదని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హితవు పలికారు. ఇటీవల కొలిమిగుండ్లకు వచ్చిన సమయంలో మంత్రి తమ కుటుంబాన్ని విమర్శించడం తగదన్నారు. ఏనాడు వ్యక్తిగతంగా తాను ఎవరినీ విమర్శించ లేదన్నారు. బీసీ కుటుంబం గురించి మాట్లాడాలంటే ఏడాది సమయమైనా సరిపోదన్నారు. కొలిమిగుండ్లలో గ్రామ పంచాయితీ సర్పంచ్ వేసే రోడ్డును ప్రారంభించి ఏదో గొప్ప ఘనకార్యం చేసినట్లు మంత్రి బీసీ వ్యవహరించారన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న ప్రధాన రహదారి స్థానంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 200 మీటర్ల పొడవున విశాలమైన సీసీ రోడ్డు నిర్మించామని గుర్తు చేశారు. సెంట్రల్ లైటింగ్, ఆర్టీసీ ప్రాంగణంలో వేసిన సీసీ రోడ్డు కనిపించ లేదా అని మంత్రిని ప్రశ్నించారు. పది మీటర్ల ప్యాచింగ్ వేసి ఏదో గొప్ప ఘనకార్యం చేసినట్లు చెప్పుకోవడం మంత్రిగా సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క కొలిమిగుండ్లలోనే భవనాల నిర్మాణాల రూపంలో రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు పేరం నందకిషోర్‌రెడ్డి, జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు బాచం మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, అంబటి చంద్రమోహన్ రెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, మొలక రాజారెడ్డి, మనోహర్‌రెడ్డి, గుర్విరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల నాణ్యత భుజాలకెరుక!

కూటమి ప్రభుత్వం 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్' అంటూ విద్యార్థులకు ఇచ్చిన బ్యాగులు కనీసం రెండు నెలలు కూడా మన్నిక రాలేదు. బ్యాగుల నాణ్యతపై మంత్రి లోకేష్ అసెంబ్లీ సాక్షిగా ప్రత్యేకంగా వివరించారు. ఏడాది పాటు విద్యార్థుల పుస్తకాలు మోయాల్సిన బ్యాగులు మున్నాళ్ల ముచ్చటగా మారాయి. నెల రోజుల్లోనే చిరిగి పోయి ఇంట్లో మూలన పడ్డాయి. దీంతో కొందరు తల్లిదండ్రులు దిక్కుతోచక కొత్త బ్యాగులు కొంటే, మరి కొందరూ రసాయన ఎరువుల సంచులను బ్యాగులుగా కుట్టిస్తున్నారు. మరి కొంత మంది విద్యార్థులు గతేడాది వైఎస్సార్‌సీపీ ఇచ్చిన జగనన్న బ్యాగులే బాగున్నాయని దాచుకున్న వాటిని బయటకు బడికి తీసుకొస్తున్నారు. శనివారం దొర్నిపాడు జిల్లా పరిషత్ విద్యార్థులు తీసుకొచ్చిన బ్యాగులే ఇందుకు నిదర్శనం.

– దొర్నిపాడు



ఎరువుల సంచి బ్యాగుతో విద్యార్థి



సొంత బ్యాగులతో స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు



కొత్తబ్యాగు చిరిగి పోవడంతో జగనన్న బ్యాగుతో ఓ విద్యార్థి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు



గాయపడిన బషీర్, షఫీబాషా

బనగానపల్లె: స్థానిక కొండపేటలోని రాంభూపాల్‌రెడ్డి నగర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన విద్యుత్ ప్రమాదంలో సోదరులు షేక్ బషీర్, షేక్ షఫీబాషా గాయపడ్డారు. ఇంటి నిర్మాణం సమయంలో షేక్ బషీర్ సిమెంట్ ప్లాస్టింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా వర్షం కురిసింది. ఇంటి పక్కనే ఉన్న 11/కేవీకి చెందిన విద్యుత్ వైర్ల నుంచి విద్యుత్ ప్రసారం కావడంతో బషీర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన అతని సోదరుడు షఫీబాషా కర్రతో కాపాడే ప్రయత్నం చేశాడు. ఆ క్రమంలో అతను కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారు టైరు పేలి వ్యక్తి దుర్మరణం



ఓంకార్ నాగిరెడ్డి (ఫైల్)

జూపాడుబంగ్లా: కర్నూలు – హైదరాబాద్ రహదారిపై కొత్తకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జూపాడు బంగ్లా మండలం పి.లింగాపురం గ్రామానికి చెందిన ఓంకార్‌నాగిరెడ్డి (35) దుర్మరణం చెందాడు. ఓంకార్ నాగిరెడ్డి భార్య వర్షిణి అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం శనివారం ఉదయం పెద్దమ్మ ప్రమీలమ్మ, బంధువు ప్రభాకర్‌రెడ్డితో కలసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలో కారు టైరు పేలి అదుపు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఓంకార్‌రెడ్డి కారులోంచి విసురుగా బయటపడటంతో తల రోడ్డుకు తగిలి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. విషయం తెలుసుకున్న గ్రామసర్పంచ్ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా ఉపేంద్ర బాబు



డీఎస్పీ ఉపేంద్ర బాబు

కర్నూలు: కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీగా ఎం.ఉపేంద్ర బాబు నియమితులయ్యారు. ఇక్కడున్న శ్రీనివాసాచారిని గుంతకల్లు డీఎస్ఆర్‌పీకి బదిలీ చేసి ఎమ్మిగనూరులో పనిచేస్తున్న ఉపేంద్ర బాబును మహిళా పీఎస్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు డీఎస్పీలకు స్థాన చలనం కల్పిస్తూ ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఇద్దరు డీఎస్పీలకు స్థాన చలనం కలిగింది. శ్రీనివాసాచారి గత ఏడాది ఆగస్టు 9వ తేదీన కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఏడాది కూడా గడవకముందే ఆయనపై బదిలీ వేటు పడటం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. అలాగే ఉపేంద్రబాబు కూడా గత ఏడాది సెప్టెంబర్ 19న ఎమ్మిగనూరు డీఎస్పీగా నియమితులయ్యారు. ఆయనను కూడా అనతికాలంలోనే బదిలీ చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతుంది. కాగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి డీఎస్పీగా నియమితులైన మర్రివాడ భార్గవిని ఎమ్మిగనూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మన'సారా' ఒక్కటై.. అడవంతా ఆదర్శమై!

- నల్లమల అడవుల్లో పొడసూడని ఆధునికత
- గిరిజన సంప్రదాయాలను వీడని చెంచులు
- యువతి, యువకుల ఇష్టాలే ప్రామాణికంగా పెళ్లిళ్లు
- వరకట్నం ఊసులేని వివాహాలు

నాగరికతకు ఎంతో దగ్గరగా ఉన్న చెంచు గిరిజనులు ఇంకా ఆదిమ సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తున్నారు. ప్రకృతితో కలసి జీవనం సాగిస్తుండటంతో వారి ఆచారాలు కూడా అంతే స్వచ్ఛంగా ఉంటున్నాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వివాహ సమయంలో ఇప్పటికీ వరకట్నం లేకపోవడం.. యువతీ యువకుల అభిప్రాయాలకు పెద్దపీట వేయడం .. నిరాడంబరంగా తంతు ముగించడం విశేషం. ప్రకృతి ఒడిలో ఒక్కటై పచ్చని బంధానికి బలమైన పునాది వేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. – ఆత్మకూరురూరల్



చెంచుల్లో సంప్రదాయ వివాహ వేడుక (ఫైల్)

సండే స్పెషల్

కాలం మారుతోంది. కొన్ని కులాలు, మతాల్లో ఆచారాలు కనుమరుగు అవుతున్నా.. ఆదిమ గిరిజనులైన చెంచులు తమదైన నాటి ఆచారాలు, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వారి వివాహ పద్ధతి నాటి సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జరపడం విశేషం. చెంచు గిరిజన పెద్దలు తమ పిల్లల వివాహ విషయాల్లో వారి ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యతన్యత ఇస్తున్నారు. ఒకరినొకరు ఇష్ట పడి ఆ విషయాన్ని పెద్దలకు చెబితే చాలు.. వెంటనే వివాహ యత్నాలు మొదలవుతాయి. గూడెం పెద్దలతో కలిసి అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి ఇంటికి వెళ్తారు. అబ్బాయి తరుపు వాళ్లు తీసుకు వచ్చిన ఐదు సీసాల సారాయిని వారి ఎదురుగా ఉంచితే అమ్మాయి తరుపు వారు మూడు సీసాల సారాను వరుడి వైపు వారు తెచ్చిన సారాయితో కలుపుతారు. ఇది రెండు కుటుంబాల కలయికకు, నూతన బంధానికి చిహ్నంగా భావిస్తారు. అలా ఒకటైన సారాయిని వచ్చిన పెద్దలకు తలా ఇంతా పంచుతారు. ఆ సమయంలోనే వివాహ దినాన్ని పెద్దలు నిర్ణయిస్తారు. చెంచుల వివాహాల్లో వరకట్నం అన్న సాంఘిక దురాచారం కనపడదు. కొద్దిపాటి కన్యాశుల్కం ఉంటుంది. అది కూడా పూర్వపు రోజుల్లో అయితే అణాలలో ఉండేది. ఇప్పుడిప్పుడే రూ.11 దాకా పెరిగింది. ఈ మొత్తాన్ని వివాహ సమయంలో వరుడు వధువుకు ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా పెళ్లి కూతురింటిలో జరిగే తంతుకు కావాల్సినదంతా పెళ్లి కొడుకు తీసుకు రావాల్సిందే. పెళ్లి కూతురికి రెండు చీరలు, పెళ్లి కూతురికి తల్లికి ఒక చీరను తీసుకెళ్లాలి. వధువు తల్లిదండ్రులకు ఆరోజు పెట్టే పప్పన్నం మాత్రమే ఖర్చు.

చెంచుల పురోహితుడు 'కోలగాడు' ..

ఇరువురిని ఒకటి చేసి వారు దంపతులని సమాజానికి ప్రకటించే తంతే వివాహం. చెంచుల్లో వివాహం జరిపించేందుకు ప్రతి గూడెంలోనూ కోలగాడు అని పిలవబడే పురోహితుడుంటాడు. సగోత్రికులలో వివాహం నిషిద్ధమైన చెంచుల్లో పలు గోత్రనామాలు కలిగిన గుంపులుంటాయి. వాటిలో ఉత్తలూరు, పులిచర్ల, గుళ్ల, దాసరి, మాండ్ల, చిగుళ్ల, జల్లి, భూమని, కుడుముల వంటి గోత్రాలు వాటిలో కొన్ని. వీటిలోని ఉత్తలూరు గోత్రానికి చెందిన వారిలో ఒకరిని ఆయా గూడేలలో పెళ్లి తంతు జరిపే పురోహితునిగా ఎంచుకుంటారు. చెంచు పురోహితున్ని 'కోలగాడు' అనిపిలుస్తారు.

ప్రకృతి ఒడిలోనే ఏకాంతం..

పెళ్లయిన వధూవరులకు అనంతరం జరిగే శోభన కార్యక్రమం నాలుగు గోడల మధ్య జరగడానికి చెంచుల ఆచారాలు అనుమతించవు. పెళ్లయిన వధూవరులు ఆహార సేకరణ కోసం అడవుల్లోకి వెళతారు. అక్కడ ప్రకృతి ప్రసాదించిన ఏకాంతం, పచ్చటి పొదరింటి శయ్యాగృహమే నూతన వధూవరులకు శోభన వేదిక అవుతుంది. నూతన వధూవరులే కాదు.. ఏ చెంచు జంటకైనా రాత్రి శృంగారం నిషిద్ధం. విహారమైనా.. ఆహార సేకరణ అయినా.. శృంగారమైనా పగటి పూటే చెంచులకు ఆనవాయితీ.

పాత ఆచారాలు మరచిపోలేం



నాగరికతకు ఎంత దగ్గరైనా మా చెంచు వాళ్లు మాత్రం పాత పద్ధతులు, ఆచారాలు వదలుకోలేదు. ఇప్పటికీ మా పెద్దోళ్లు చెప్పిన పద్ధతిలోనే పెళ్లిళ్లు చేసుకుంటున్నాం. పద్ధతులు మారిస్తే మా పెద్దోళ్లు పైనుంచి కోపగించుకుంటారనే భయమూ ఉంది.పెళ్లంటే అన్ని ఖర్చులు మగపెళ్లి వాళ్లే పెట్టుకుంటారు. ఆడపెళ్లి వాళ్లకు ఎలాంటి ఖర్చు లేదు. – ఉత్తలూరి అంకన్న, కోలగాడు, నాగలూటి గూడెం

పిల్లల ఇష్టాలతోనే



మా గూడేల్లోకి చర్చీలు, ఆలయాలు వచ్చినా.. మా దేవుళ్లు అయిన ఈదన్న, గుగ్గిళ్ల బయ్యన్న, మంతనాలమ్మలను కొలవడంలో మాత్రం మార్పులేదు. అట్లాగే పెళ్లిళ్లు కూడా సంబరంగా జరుపుకుంటారు. పిల్లగాళ్ల ఇష్టాలతోనే పెద్దవాళ్లు జత కట్టిస్తారు.

– వెంకటేశ్వర్లు, చెంచు దేవతల పూజారి, బైర్లూటి

చెంచుల పెళ్లింట విశేషాలు..



- వివాహానికి ముందు రోజు సాయంత్రం పెళ్లి కూతురు ఇంటికి పెళ్లి కుమారుడు తరపు బంధువులంతా చేరుకుంటారు. పుట్ట మన్నుతో వివాహ వేదికను తయారు చేసి అక్కడ బాణాలను ఉంచుతారు. కొన్ని చోట్ల గంజి కావడి తెచ్చి వచ్చిన వారికి అందిస్తారు.
- ఆ రాత్రి వధూవరులకు నలుగు కార్యక్రమం ఉంటుంది. ఒక వైపు నలుగులు జరుగుతుంటే మరోవైపు అందరు కలసి నాట్యం చేస్తారు. ఈ నాట్యానికి చెంచులకు ఇష్టమైన తప్పెట వాదన ఉండనే ఉంటుంది.
- గూడెంలోని ఆడవారంతా తెల్లవారుజామునే వధూవరులను కోలగాడి (పురోహితుడు) సమక్షంలో స్నానాల బండ వద్దకు తీసుకెళ్తారు. పుక్కిట పట్టిన నీళ్లు కూడా ఒకరిపై మరొకరు పుక్కిలించుకుంటారు. (ఈ తంతు అంతా వధూవరుల మధ్య బిడియం తగ్గి పోవడానికే). అనంతరం కోలగాడు వధూవరులిద్దరికీ నూతన వస్త్రాలను అందించడంతో వివాహానికి సిద్ధమవుతారు.
- కోలగాడు దారంతో నూలుపోగు తయారు చేసి పసుపు కొమ్మును కట్టి మంగళసూత్రంగా తయారు చేస్తాడు. వరుడు పెద్దలందరికీ చూపుతూ అందరి చప్పట్ల మధ్య వధువు మెడలో కట్టడంతో వివాహ క్రతువు ముగుస్తుంది.
- పెళ్లి జరిగిన రోజు వధువు ఇంటిలో పెండ్లికి వచ్చిన వారికి పప్పన్నాన్ని మాత్రమమే వడ్డిస్తారు. అయితే వధూవరులు వరుడి ఇంటికి వచ్చిన రోజున మాంసాహారంతో విందు చేస్తారు. సారాయి సరేసరి. స్థోమతను బట్టి సంబరం జోరుగుంటుంది.
- పెళ్లి క్రతువును ఏమాత్రం భరించే శక్తి లేని వధూవరులను ఒక చోటకు చేర్చి కోలగాడు వారి కొంగులు ముడి వేసి వారి పెళ్లి అయ్యిందని ప్రకటించడంతో వారి వివాహ జీవితం ప్రారంభమవుతుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ధరణికుమార్ (ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణంలోని ఇండోర్‌స్టేడియం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరుకు చెందిన అల్లూరి ప్రభాకర్, చెన్నమ్మ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్తకు దూరమై 15 సంవత్సరాల క్రితం పిల్లలతో సహా ఆమె కోవెలకుంట్లలో స్థిరపడింది. పట్టణంలోని ఓ మార్ట్‌లో తల్లితోపాటు కుమారుడు ధరణికుమార్(20) గుమాస్తాలుగా పనిచేస్తున్నారు. ఉదయం 10 గంటల సమయంలో ఆ యువకుడు జమ్మలమడుగు చౌరస్తా నుంచి బైక్‌పై పట్టణంలోకి వస్తూ లారీ టైర్ల కింద పడ్డాడు. భారీ వాహనం కావడంతో శరీరభాగాలు నుజ్జయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. వంద మీటర్ల దూరంలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మంత్రి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సీఐ హనుమంతునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ కళాశాలలోకి వర్షపునీరు



పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తరగతి గదుల్లోకి శనివారం వర్షపునీరు వచ్చి చేరింది. జోరు వాన కురవడం, కళాశాలకు కేటాయించిన గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ దుస్థితి నెలకొంది. తరగతి గదిలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'రైతుసేవ'లు మూత



మూతపడిన రైతుసేవా కేంద్రం

ఆలూరు రూరల్: అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉండాల్సిన రైతుసేవా కేంద్రాలు మూత పడ్డాయి. ఆలూరు మండలంలోని హత్తిబెళగల్, కమ్మరచేడు, కురుకుంద, మనేకుర్తి, కురువళ్లి, హులేబీడు గ్రామాల్లో ఈ కేంద్రాలు పనిచేయడం లేదు. ఇటీవల ఈ కేంద్రాలకు బదిలీపై వచ్చిన ఎవ్వరూ చేరకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసి అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. అయినా రైతుసేవా కేంద్రాలను అధికారులు అందుబాటులోకి తీసుకురావడం లేదు.

రేపటి నుంచి ప్రకృతి సేద్యంపై వీపీఏలకు అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్):ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు రైతు సేవ కేంద్రాల ఇన్‌చార్జీలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి తెలిపారు. అన్ని వ్యవసాయ శాఖ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే ఈ సదస్సుల్లో ఎంపిక చేసిన వీపీఏలకు మాత్రమే మాస్టర్ ట్రినర్లు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ప్రతి డివిజన్‌కు మాస్టర్ ట్రినర్లను నియమించామని, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పోర్టల్ క్లోజ్

కర్నూలు(అగ్రికల్చర్): గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు–మేకలు, కోళ్లు, పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పలకడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ప్రోత్సాహకాలను రైతుల్లోకి తీసుకెళ్లడంలో పశుసంవర్ధక శాఖ నిర్లక్ష్యం చేసింది. ఈ నేపథ్యంలోనే దరఖాస్తులు అప్‌లోడ్ చేసే పోర్టల్‌నే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ క్లోజ్ చేసింది. ఈ విషయాన్ని ముందుగానే కూటమి ప్రభుత్వం దృష్టికి ఎన్ఎల్ఎం అధికారులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పోర్టల్‌ను క్లోజ్ చేస్తూ కొద్దిరోజుల క్రితమే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫలితంగా రెండు, మూడు రోజులుగా దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు ఔత్సాహికులు యత్నిస్తున్నా సైట్ ఓపెన్ కాకపోతుండటంతో సాంకేతిక సమస్య అనుకున్నారు. తీరా పోర్టల్‌నే క్లోజ్ చేసిన విషయం తెలుసుకొని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ సన్నజీవాల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తుండటంతో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై పశుసంవర్ధకశాఖ ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలకు డిమాండ్ ఏర్పడింది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో గొర్రెలు, మేకల శిక్షణా కేంద్రం ఏర్పాటైంది. ఎన్ఎల్ఎం ద్వారా గొర్రెల పెంపకానికి దరఖాస్తు చేయాలంటే శిక్షణ పొందినట్లు సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. ఇందువల్ల ప్యాపిలి మండలంలోని గొర్రెలు, మేకల శిక్షణా కేంద్రానికి డిమాండ్ పెరిగింది. ఎన్ఎల్ఎం సబ్సిడీ పథకానికి సంబంధించిన పోర్టల్ క్లోజ్ కావడంతో శిక్షణకు కూడా డిమాండ్ తగ్గే పరిస్థితి ఏర్పడింది.

ప్రజల ప్రాణాలు తీస్తారా?

- వెంటనే మైనింగ్ తవ్వకాలను ఆపాలి
- ఆగ్రహం వ్యక్తం చేసిన హత్తిబెళగల్ గ్రామస్తులు
- మైనింగ్ శాఖ డీడీ కారు ముందు బైఠాయించి నిరసన



హత్తిబెళగల్ కొండలో మైనింగ్ పనులు నిలిపివేయాలని మైనింగ్ అధికారుతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

ఆలూరు రూరల్: 'అనుమతులు లేకుండా మైనింగ్ తవ్వకాలు చేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తారా?' అంటూ హత్తిబెళగల్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి అనుకొని ఉన్న క్వారీలో 2018లో పేలుడు జరిగి 14 మంది కార్మికులు మృతి చెందారని..గ్రామంలోని 40 శాతం ఇళ్లు పగుళ్లు ఏర్పడ్డాయని, మళ్లీ ఎలా పనులు చేస్తారని ప్రశ్నించారు. మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవి చంద్ర కారు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. హత్తిబెళగల్, అగ్రహారం గ్రామాల మధ్య సర్వే నంబర్ 969/పీలోని 8.094 హెక్టార్లలో మైనింగ్ తవ్వకాలకు (క్వార్ట్జ్) అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఏం జరిగిందంటే..

తమ గ్రామానికి ఆనుకొని ఉన్న కొండలో మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఈ నెల 14వ తేదీ సోమవారం హత్తిబెళగల్ గ్రామస్తులు కర్నూలులో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. క్వారీలో జరుగుతున్న పనులు నిలిపివేసి, ఆ కొండలో తవ్వకాలు జరిపితే గ్రామస్తుల ఇబ్బందులపై విచారణ జరిపి తమకు నివేదిక ఇవ్వాలని జిల్లా మైనింగ్ శాఖ డీడీ రవిచంద్రను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా మైనింగ్ శాఖ డీడీ శనివారం హత్తిబెళగల్ గ్రామానికి వెళ్లారు. సర్వే నంబర్ 969/పీ ఉన్న కొండను, చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించారు.

గ్రామస్తుల వేదన ఇదీ..

మైనింగ్ అధికారులు వచ్చారన్న సమాచారంతో హత్తిబెళగల్ గ్రామస్తులు ఒక్క సారిగా కొండ వద్దకు చేరుకున్నారు. గ్రామానికి అనుకుని ఉన్న కొండల్లో క్వార్ట్జ్ తవ్వకాల కోసం పేలుళ్లు జరిపితే ప్రజల ప్రాణాలు పోతాయని, ఇళ్లు ధ్వంసం అవుతాయని వాపోయారు. ఇక్కడే క్వారీలో పేలుడు జరిగి 2018లో 14 మంది కార్మికులు మృతి చెందారని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదే సర్వే నంబరులో గ్రామానికి చెందిన 12 మందికి డీ పట్టాలు ఇచ్చారని వారందరూ కొండకు అనుకుని ఉన్న భూమి సాగుచేసుకుంటున్నారన్నారు. పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోకుండా, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా తవ్వకాలకు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కొండలో జరుగుతున్న పనులు వెంటనే ఆపివేసి, మైనింగ్ అనుమతులు రద్దు చేసి వెళ్లాలని మైనింగ్ అధికారుల కారు ముందు బైఠాయించి నిరసన చేపట్టారు.

తహసీల్దార్‌కు ఉత్తర్వులు ఇస్తాం

గ్రామస్తుల ఆందోళనతో జిల్లా మైనింగ్ శాఖ డీడీ రవి చంద్ర స్పందించారు. ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించి మైనింగ్ విషయంపై సోమవారంలోగా తహసీల్దార్‌కు ఉత్తర్వులు ఇస్తామని డీడీ రవిచంద్ర హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

ఆలయ ఉద్యోగిపై కేసు నమోదు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న పరిచారకుడు విద్యాధర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల విద్యాధర్ శ్రీశైలం గర్భాలయంలోని క్లాత్ హుండీలో చోరీకి పాల్పడ్డాడు. సీఎస్ఓ ఫిర్యాదు మేరకు విద్యాధర్‌పై చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జీడీపీకి ఎల్లెల్సీ నీరు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) నీటిని ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ)కు ఇరిగేషన్ అధికారులు శనివారం మళ్లించారు. ఇరిగేషన్ ఏఈ పరమేష్ మాట్లాడుతూ.. తుంగభద్ర దిగువ కాలువకు 186 క్యూసెక్కుల నీరు వస్తుండగా గోనెగండ్లలో ఎస్కేప్ చానల్ ద్వారా 111 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టులోకి వదిలినట్లు తెలిపారు. మిగతా 75 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి పంపించామన్నారు.